# అద్దం

ఆ రోజు నేనో వింత దృశ్యం చూశాను. బైక్ నడుపుతున్న ఫ్రెండ్‌ని షడన్ బ్రేక్ వేయించాను.

"ఏవండేవండీ... ఒక్కసారి బైక్ వెనక్కి తిప్పండి" చాలా ఎగ్జైటింగ్‌గా అడిగాను.

"దేనికి..." ఎవరో అందమైన సుందరాంగో.. లంగా వోణీ వయ్యారో... అయితే ఇంకోసారి చూడాలనిపించి పనున్నట్లు వెనక్కి మళ్లీ .... ఓసారి మళ్లీ చూడ్డం ఆ రోజుల్లో మా సరదా. అందుకే ఆయన కూడా ఉత్సాహంగా బండి వెనక్కి తిప్పాడు.

"ఇక్కడే... ఇక్కడాపండి" అంటూ నేను చూసిన దృశ్యానికి కాస్త చాటుగా బైక్ ఆపించాను.

అరవై డెబ్భై ఏళ్ల మధ్యలో ఉన్న ముసలావిడ- భర్త గతించిన వైనం ఆవిడ కట్టుకున్న మల్లు పంచె (చీర అనరు దాన్ని) చాటున ఉన్న గుండు

వల్ల తెలుస్తోంది.

వళ్లంతా ముడతలు!

పళ్లు లేవు!

ఆ వయస్సులో ఆ ఆకారంతో వీధి అరుగుమీదే కూచుని అద్దం చూసుకుంటోంది.

ఎందుకట?

నవ్వు రాబోయి డౌట్ పెరిగింది. నిజంగా ఆవిడకి అద్దంలో చూసుకుంటే అందం కనిపించదు. ఆనందం కలగదు. మరెందుకు ఈ అద్దం పిచ్చి?

"ఆవిడెవరండీ" మా ఫ్రెండ్ నడిగాను. ఫ్రెండ్ చెప్పిన విషయం కథలా అనిపించింది!!

✦ ✦ ✦

ఆవిడ పేరు అన్నపూర్ణమ్మగారు.

గత నాలుగు నెలల దాకా తన గంభీర వాఘ్ఝరితో అనర్గళంగా చుట్టు ప్రక్కల ఆలయాల్లో ఆధ్యాత్మిక కేంద్రాల్లో ఉపన్యాసాలు చెప్పి వేలాది భక్తుల హృదయాల్ని ఆకట్టుకున్న రామశాస్త్రిగారి అర్ధాంగి ఆమె!

రామశాస్త్రిగారిది గంభీరమైన గళం మాత్రమే కాదు. నిలువెత్తు పాండిత్యం- చెయ్యెత్తు సౌందర్యం. ఆయన పలకరింపు స్వాంతనం. దరహాసం- అనురాగయుతం. పద్యాలాపన... సంగీతమయం. అర్థ వివరణ... ఆలోచనామృతం. పండిత పామర రంజకంగా... నాటకం చూస్తున్నట్లు ఉంటుంది. ఆయన నమ్మేదే చెప్పేవాడు... చెప్పినదే

ఆచరించేవాడు.

ఎప్పుడో ఎనిమిది ఏళ్ల పిల్లగా ఉండగా అన్నపూర్ణ- రామశాస్త్రి భార్య అయింది. రామశాస్త్రి పెళ్లినాటికి పదమూడు ఏళ్లు. అప్పటికే అతను పంచ కావ్యాలూ కొన్ని పురాణాలూ లక్ష్యలక్షణంగా చదివేశాడు. పిల్ల బంగారంలా ఉందని రామశాస్త్రి తల్లిదండ్రులు ముచ్చటపడ్డారు. రామశాస్త్రికి మహర్దశ ఉందని అతని జాతకం చూసి అన్నపూర్ణ తల్లిదండ్రులు సంబరపడ్డారు. రెండు కుటుంబాల వాళ్లూ కలిగిన వారే కావటంతో వైభవోపేతంగా వారి వివాహం జరిగింది. రెండు కుటుంబాల పెద్దలూ గతించారు గానీ... వీళ్లింట వంశాంకురం జరగలేదు. పెద్దవాళ్లందరూ దూరమై పోయాక అన్నపూర్ణకి పిల్లల్లేరనే బెంగ మొదలైంది.

ముప్ఫయ్యేళ్లు దాటుతున్నా, పిల్లలు కలగలేదని బెంబేలెత్తిపోయేది. రామశాస్త్రి స్థితప్రజ్ఞుడు- "ఊరు అందరూ నన్ను గురువుగా నిన్ను అమ్మగా ఆదరిస్తుంటే ఇంకా మనం ఒంటరివాళ్లన్న బాధ దేనికి" అని అన్నపూర్ణకి నచ్చచెప్పేవాడు. భర్త తన ఉపన్యాస కార్యక్రమంలో హడావుడిగా ఉన్న వేళ ఆ ఒంటరితనంతో మరింత బెంగటిల్లేది. రామశాస్త్రి తన భార్యని కన్నకూతుర్లా లాలించేవాడు. కన్నతల్లిలా ఆదరించేవాడు. భర్తగా తన బాధ్యతలన్నీ సక్రమంగా నిర్వర్తించేవాడు. స్నేహం అనే మాటలో ఇద్దరూ తలో అక్షరం- ప్రేమ అనే పదంలో ఇద్దరూ చెరో అక్షరం.

భార్యను మరిపించడానికీ... మురిపించడానికీ రామశాస్త్రి గారికి ఓ రోజు ఒక సరదా ఆలోచన పుట్టింది.

బయటనుండి తిరిగి వచ్చేటప్పుడు డజను నిలువుటద్దాలు కొని

తెచ్చాడు. ఏమిటో... ఎందుకో తెలియక అయోమయంలో పడిన అన్నపూర్ణమ్మ ప్రశ్నకి జవాబుగా చిలిపిగా నవ్వుతూ 'చూస్తావుగా' ఆత్రం దేనికి అన్నట్టు చూశాడు! ఆమె ఆశ్చర్యంలో ఉండగానే ఇంటి నిండా నిలువుటద్దాలు ఏర్పాటు చేయించాడు. ముందు గదిలో, పడక గదిలో, వంటింట్లో ఆఖరికి నీళ్ల గదిలో కూడ గోడలకి రెండు వైపులా నిలువుటద్దాలు ఏర్పాటు చేయించాడు. విస్తుపోతున్న భార్యతో "నీకెంతమంది ముత్తైదువులు తోడున్నారో చూడు. సప్త ఋషుల భార్యలు, త్రిమాతలు... ఆరుగురు పతివ్రతలు..." అంటూ తనకున్న పురాణ పరిజ్ఞానాన్ని ఉదహరిస్తూ ఆమెను నవ్వించాడు. మైమరిపించాడు. తొలి యవ్వన సౌరభాలని, సౌందర్యాన్ని చవి చూపించి... తుళ్లింతలతో పులకింప చేశాడు. అన్నపూర్ణమ్మ ఎంతో స్వాంతన పొందింది. చిన్న పిల్లలా మురిసిపోయింది.

✦ ✦ ✦

ఓరోజు రామశాస్త్రి ఒక ఆలయ ప్రాంగణంలో గజేంద్ర మోక్షం ప్రవచనం చెప్తున్నారు. "అల వైకుంఠ పురంబులో... నగరిలో..." అంటూ కళ్లకి కట్టినట్టు చెప్తూ... ఆ రమా వినోదుడిని బొమ్మేసినట్టు చూపిస్తూ... చూస్తూ... తన్మయంగా వ్యాసపీఠం మీదకి నెన్నుదురు సోకించాడు. ఇంక లేవలేదు.

"ఊళ్లో వాళ్లందరూ మన కొడుకులేనే" అంటూ నిత్యం అనే రామశాస్త్రి మాట సత్యం అయినట్లు ఊళ్లో వాళ్లందరూ కలిసి ఆయన అంత్యక్రియలు ఘనంగా నిర్వర్తించారు.

అన్నపూర్ణమ్మ సశాస్త్రీయంగా వైధవ్యాన్ని స్వీకరించింది.

పది రోజులు పండగలా చేశారు. రామశాస్త్రిని అందరూ కలిసి

స్వర్గానికి సాగనంపారు.

ఆ తర్వాత ఆమె రూపం మారిపోయింది. పసుపు, కుంకాలు, రంగు రంగుల పట్టు చీరలు, వంటి మీదుండే బంగారు ఆభరణాలు, ఇంట్లో ఉండే పందిరి పట్టె మంచం దగ్గర్నుంచి ఆయనా తనూ ఇన్నాళ్లుగా పోగేసుకున్న ఐశ్వర్యాన్నంతటినీ ఊళ్లోని కొడుకులందరికి తన భర్త జ్ఞాపకంగా పంచి పెట్టేసింది.

ఇంక మిగిలినవి... డజను నిలువుటద్దాలు. అవన్నీ కూడా అవసరమైన వాళ్లందరినీ 'పట్టుకెళ్ళిపొమ్మ'ని తను నీళ్లతో కళ్లు మూసుకుంది. ఇప్పుడా ఇంట్లో తను ఏకాకి. దేవుడి పిలుపు కోసం, తన దేవుడ్ని చేరడం కోసం... తను వండుకుని... కొంత తిని... మిగిలిం దంతా పనమ్మాయికో, పాలవాడికో పంచి పెడ్తుంది. యముడి కోసం తపస్సు చేస్తున్న యోగినిలా మారిపోయింది.

✢ ✢ ✢

నాలుగు నెలలు ఇలా భారంగా గడిచిపోయాయి. గాయం చేసే దేవుడు మాయం చేసే మంత్రం వేస్తాడంటారు. కానీ అన్నపూర్ణమ్మకి ఆ మంత్రం పని చేయలేదు. కళ్ళల్లో నీళ్లు ఇంకిపోయినా ఆవిడ శోకం ఆగలేదు.

ఇప్పుడిన్నాళ్లు పోయాక ఆవిడకు అద్దం కావల్సి వచ్చింది ఎందుకు? తెలుసుకోవాల్సిందే!

✢ ✢ ✢

హఠాత్తుగా అన్నపూర్ణమ్మ కంట్లో నలక పడింది. చూడ్డానికీ, తీయడానికీ ఎవరూ లేరు. ఎవరైనా ఉన్నా పిలిచి సాయం చేయమనే

తత్వం కాదావిడది. మర్నాడు పనిపిల్ల అంట్లు తోమడానికి వచ్చి, కప్పలా వాచిన ఆవిడ కన్ను చూసి కంగారు పడింది. ఆయుర్వేద వైద్యం చేసే గుడిలో పూజారిగారిని పిలిచింది. ఆయన కన్ను చూసి కంగారు పడ్డాడు. ఆయనొచ్చేసరికి అద్దంలో చూసుకుంటూ కంటికీ, మంటికీ నీరు కారుస్తున్న అన్నపూర్ణమ్మగారి కంటికి ఇది మరీ ప్రమాదమని హెచ్చరించాడు. పని మనిషితో అద్దం తీసేయమని చెప్పి, "అమ్మా! మీరు కంటిని బాగా నలిపారు. పైగా చాలా దుఃఖపడుతున్నారు. ఈ దుఃఖానికి కారణం నాకు తెలుసు. మీరు ఇన్నాళ్లుగా అద్దం చూసుకోలేదు... ఇప్పుడు..."

"నాకద్దం అవసరమయ్యింది. ఆయన రోజూ దేవతార్చన చేసే ముందు... విభూతి పెట్టుకునే దేవతార్చన పెట్టెలోని అద్దం తీయక తప్పలేదు. ఆ దేవుణ్నీ, అర్చననీ నేను వదిలేసినా దేవతార్చన పెట్టె తీయక తప్పలేదు. అద్దాన్ని చూడక తప్పట్లేదు. అద్దంలో నా దిక్కుమాలిన మొహం నాకు కనిపించట్లేదు. ఆయనే కనిపిస్తున్నారు" అని భోరుమంటూ చెప్పింది. "నేను తట్టుకోలేక పోతున్నాను ఆచారీ" అంది.

"నాకు తెలుసు తల్లీ... నీ ఎడమ కన్ను కోసమైనా... మీరు ఆ దుఃఖాన్ని ఆపుకోవాలి. మీరిక అద్దం చూడొద్దు" అన్నాడు వైద్యాచార్యుడు.

"ఈ ఇంటి కుడి కన్ను ఎప్పుడో పోయింది బాబూ! ఎడమ కన్ను నిలుపుకోవాలని నాకు తాపత్రయం లేదు" అంది.

ఆవిడ మాట అందరితో పాటు నేనూ విన్నాను. నా కళ్ల నిండా నీళ్లు తిరిగాయి. ఇంక నాకేం కనిపించట్లేదు. మా ఫ్రెండ్‌ని 'ఇంటికెళ్లిపోదా'మన్నాను.

